
# రాలని చినుకు.. రాని కునుకు

- రెండు నెలలుగా తీవ్ర వర్షాభావం
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- పశుగ్రాసానికీ కటకట
- ఆందోళనలో రైతులు


రామాపురం వద్ద ఎండుముఖం పట్టిన వేరుశనగ పంట

**నల్లమాడ:** ఈ ఏడాదైనా వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండుతాయన్న రైతన్నల ఆశలు అడియాసలయ్యాయి. దాదాపు రెండు నెలల నుంచి తీవ్ర వర్షాభావం నెలకొనడంతో అరకొరగా రైతులు సాగుచేసిన పంటలు ఎండుముఖం పట్టాయి. బోరుబావుల్లో సైతం భూగర్భ జలాలు అడుగంటి సాగు, తాగునీరు కొరత ఏర్పడింది. వర్షాకాలంలోనే పశుగ్రాసం సమస్యతో పాడి రైతులు అవస్థలు పడుతున్నారు. ఈఏడాది కూడా కరువు తప్పదని, బతుకుదెరువు కోసం వలసబాట పట్టాల్సిన పరిస్థితులు దాపురించాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎండుతున్న వేరుశనగ**

మే నెలలో అరకొరగా వర్షం కురవడంతో ఎన్నో ఆశలతో అప్పులు చేసి రైతులు వేరుశనగ పంట సాగుచేశారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 4 వేలఎకరాల్లో వేరుశనగ సాగుచేసినట్లు అంచనా. ప్రస్తుతం పంట పూత, పిందె దశల్లో ఉంది. విత్తనం మొలకెత్తిన నాటినుంచి వరుణుడు ముఖం చాటేయడంతో ఎక్కడ చూసిన వేరుశనగ పంట ఎండుముఖం పట్టింది. చినుకు నేల రాలకపోవడంతో వేల రూపాయలు ఖర్చుచేసి సాగుచేసిన పంటను కాపాడుకోవడానికి అన్నదాతలు అవస్థలు పడుతున్నారు.

**సాగు, తాగునీటి కొరత..**

గతేడాది కూడా వర్షాలు అంతంతమాత్రంగానే కురిశాయి. ఫలితంగా ఈ ఏడాది వర్షాకాలంలోనే బోరుబావుల్లో నీరు అడుగంటిపోయి సాగు, తాగునీటి కొరత ఏర్పడింది. ప్రస్తుతం బోరుబావుల క్రింద వేరుశనగ, మొక్కజొన్న, సజ్జ, వరి, కూరగాయల పంటలు సాగులో ఉన్నాయి. రోజురోజుకు బోరుబావుల్లో నీటి మట్టం తగ్గిపోతోందని, దీంతో పంటలకు తగినంత నీరు అందించలేక నష్టపోతున్నామని రైతులు నిస్సహాయత వ్యక్తపరుస్తున్నారు. మరోపక్క చాలా గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొనడంతో నీటి కోసం ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. ఖాళీ బిందెలతో మహిళలు రోడ్డెక్కుతున్నారంటే సమస్య ఏస్థాయిలో ఉందో అర్థమవుతోంది. మరోపక్క అడవిలో ఎక్కడ కూడా చుక్కనీరు, పశుగ్రాసం లేకపోవడంతో పశుపోషణ భారమైనట్లు, పశుగ్రాసం ధరలు ఆకాశాన్నంటుతున్నట్లు పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు.

## పంటెండుతోంది



వాన వస్తుందన్న నమ్మకంతో రెండెకరాల్లో వేరుశనగ పంట వేశా. సేద్యం, విత్తనాలు, ఎరువుల కోనుగోలు ఇలా ఒక ఎకరా పంటసాగుకు రూ.30 వేలు ఖర్చు వచ్చింది. పంట పూత దశలో ఉంది. రెన్నెళ్లుగా వాన రాకపోవడంతో పంట ఎండిపోతోంది. బోరుబావిలో కూడా నీరు రావడం లేదు. పంటను ఎలా కాపాడుకోవాలో దిక్కుతోచడం లేదు.

– ఎస్. వెంకటరమణ, రైతు, బొగ్గలపల్లి, నల్లమాడ మండలం

## పెట్టుబడి కూడా కష్టమే



వ్యవసాయంపై మక్కువతో ఐదెకరాలు కౌలుకు తీసుకొని వేరుశనగ పంట వేశా. పంటసాగుకు రూ.1.5 లక్షలు పెట్టుబడి పెట్టా. వర్షం రాకపోవడంతో పంట మొత్తం ఎండిపోతోంది. ఇతర రైతుల బోరుబావుల నుంచి అరకొరగా నీరు అందిస్తున్నా ప్రయోజనం లేకుంది. పెట్టుబడి కూడా చేతికొస్తుందో, లేదో అనుమానంగా ఉంది.

– నారాయణస్వామి, కౌలు రైతు, మూలప్పగారిపల్లి, నల్లమాడ మండలం

## క్లుప్తంగా

### డ్రైవర్, కండక్టర్ నిజాయితీ


ప్రయాణికుడికి పర్సు అందిస్తున్న దృశ్యం

**కదిరి అర్బన్:** ప్రయాణికుడు బస్సులో పోగొట్టుకున్న పర్సును తిరిగి అతడికి అందజేసి తమ నిజాయితీ చాటుకున్నారు ఆర్టీసీ కండక్టర్ ప్రసాద్, డ్రైవర్ రుద్రంనాయుడు. వివరాలు.. మహబూబ్ బాషా అనే ప్రయాణికుడు కదిరి నుంచి మదనపల్లికి వెళ్లేందుకు కదిరి డిపోలో ఆర్టీసీ బస్సు ఎక్కాడు. మదనపల్లి బస్టాండుకు ముందే పర్సుబస్సులోనే మరచి దిగిపోయాడు. బస్సు బస్టాండ్‌కు వెళ్లగానే ప్రయాణికులు అందరూ దిగిపోగా పర్సు కింద పడి ఉండడం గమనించారు. పర్సు తీసుకుని అందులోని ఫోన్ నంబర్ ఆధారంగా బాషాకు ఫోన్ చేసి డిపోకు రమ్మని పర్సును కదిరి డిపో డ్రైవర్ రమణ, కండక్టర్ హరికుమార్ సమక్షంలో అందజేశారు. పర్సులో కొంతమేరకు నగదు. ఏటీఎం కార్డు, ఆధార్‌కార్డు మరికొన్ని కార్డులు ఉన్నాయి. ఆర్టీసీ ఉద్యోగుల నిజాయితీని అందరూ ప్రశంసించారు.

### గుండెపోటుతో విద్యుత్ లైన్‌మెన్ మృతి


ఈరయ్య(ఫైల్)

**తాడిమర్రి:** మండలంలోని దాడితోట గ్రామంలోని 11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో లైన్‌మెన్‌గా పని చేస్తున్న కంసలి ఈరయ్య (55) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. చిల్లకొండయ్యపల్లి గ్రామానికి చెందిన ఈరయ్య తాడిమర్రిలో కుటుంబంతో కలసి ఉంటూ దాడితోట గ్రామంలో విధులు నిర్వహిస్తున్నాడు. తెల్లవారు జామున 4.30 గంటలకు నిద్రలేచిన వీరయ్య స్నానం చేసి కూర్చున్నాడు. ఇంతలో గుండె నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు తెలిపాడు. వెంటనే వీరి ఇంటి పక్కలో ఉన్న అతని స్నేహితుని సాయంతో బాధితున్ని బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు అతన్ని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతునికి భార్య మునెమ్మ, కుమారుడు చక్రధర్, కుమార్తె పద్మజ ఉన్నారు.

### రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో కేదార్ ప్రతిభ


షీల్డ్ అందుకుంటున్న కేదార్‌నాథ్ గుప్త


**ధర్మవరం అర్బన్:** రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో ధర్మవరం బీఎస్‌కే చెస్ అకాడమీ క్రీడాకారుడు ప్రతిభ చాటినట్లు అకాడమీ చీఫ్ కోచ్ ఎస్.ఆదిరత్నకుమార్ తెలిపారు. ఆదివారం నంద్యాల జిల్లాలో రాష్ట్ర చెస్ అసోసియేషన్ నిర్వహించిన అండర్-16 బాయ్స్ కేటగిరిలో కేదార్‌నాథ్‌గుప్త 2.5/3తో నెగ్గి మొదటిస్థానం కైవసం చేసుకున్నాడన్నారు. ఈసందర్భంగా కేదార్‌నాథ్‌గుప్తను చీఫ్ కోచ్ ఆదిరత్నకుమార్ అభినందించారు.

### అబాకస్ పోటీల్లో ప్రతిభ


ట్రోఫీలు, సర్టిఫికెట్లు సాధించిన విద్యార్థులు

**ధర్మవరం అర్బన్:** రీజనల్ లెవల్ అబాకస్ పోటీల్లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని మిరాకిల్ ఎడ్యుకేషన్ సెంటర్ డైరెక్టర్ శ్రీవాణి, ఫ్రాంచైజీ చంద్రశేఖర్ తెలిపారు. తాడిపత్రిలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో తమ సెంటర్ విద్యార్థులు గ్రీష్మశ్రీ, ఆదిత్యసాయి ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్ సాధించారన్నారు. జస్వంత్, పంవిత్‌శౌర్యా, ఇషాన్ ఛాంపియన్‌షిప్, మోనిత్, అవనీష్, మోక్షజ్ఞ, ధన్విత్, జైనందన్ టాపర్స్‌గా, జస్వంత్, రతన్, హరిచందన, నాగ చరిత్, జగత్‌కృష్ణ, పద్మజ్‌లు విన్నర్స్‌గా నిలిచారని తెలిపారు. దాదాపు 500 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారన్నారు.

### కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె


నిరసన తెలుపుతున్న కార్మికులు

**పుట్టపర్తి టౌన్:** తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు ఎనిమిదో రోజూ సమ్మె కొనసాగించారు. మున్సిపల్ కార్యాలయం ముందు ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ అప్కాస్ సంస్థను రద్దు చేసి ప్రైవేటు సంస్థలకు అప్పగించడం సరికాదని మండిపడ్డారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నాగార్జున, నరసింహులు, కోశాధికారి గోవిందు, సహాయ కార్యదర్శి పెద్దన్న, రామయ్య, కార్మికులు పాల్గొన్నారు.

## కక్షపూరిత రాజకీయాల్లో బాబు దిట్ట


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి

**కదిరి టౌన్:** కక్షపూరిత రాజకీయాల్లో సీఎం చంద్రబాబు దిట్ట అని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ లోకసభ పక్షనేత, ఎంపీ మిథున్ రెడ్డిని వారు తీవ్రంగా ఖండించారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ బాబ్జాన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈసందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి లింగాల లోకేశ్వర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కెవి.ప్రణీత్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. అధారాలు లేకుండా లిక్కర్ స్కామ్‌లో సిట్ అధికారులు మిథున్‌రెడ్డిని అక్రమ అరెస్టు చేయడం దారుణమన్నారు. రాజకీయ కక్షతో పెద్దిరెడ్డి కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం వేధిస్తోందని, ఇందులో భాగమే మిథున్‌రెడ్డి అరెస్ట్ అన్నారు. ఎలాంటి అధారాలు లేకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితోపాటు మరి కొందరిని ఇప్పటికే అరెస్ట్ చేసి జైలుకు పంపారన్నారు. ఇది కూటమి ప్రభుత్వ అరాచకానికి నిదర్శమన్నారు. ఇదంతా మంత్రి లోకేష్ డైరెక్షన్‌లో జరుగుతోందన్నారు. మాజీ మంత్రి అర్‌కె రోజాపైన నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలైనా ఒక్కరికైన కొత్తగా పింఛన్ అందించారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు మాని ప్రజా సంక్షేమానికి పాటుపడాలని హితవుపలికారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు రవికుమార్‌రెడ్డి, మణికంఠనాయక్, ఆశోక్‌కుమార్ రెడ్డి, రంగారెడ్డి, రవీంద్రరెడ్డి, కౌన్సిలర్లు లింగాల కృపాకర్‌రెడ్డి, ఆవులస్వామి, అహ్మద్, నాయకులు రమేష్‌యాదవ్, బాబా తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం కృషి


తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

**తాడిమర్రి:** వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం కృషి చేద్దాం డీసీఎంఎస్ మాజీ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ఇటీవల కొత్తగా నియామకమైన మండల కమిటీతో సమావేశమయ్యారు. పార్టీ చేపట్టబోయే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టాలని ఆయన వారికి సూచించారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలను ఎలా మోసం చేసిందో ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం కమిటీ సభ్యులు తమ నియామకానికి కృషి చేసిన తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డికి శాలువా కప్పి, పూల మాలలు వేసి ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీసెల్ విభాగం నియోజకవర్గ అధ్యక్షులుగా కుంటాల పుల్లయ్య, మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజినేయులు, ఉపాధ్యక్షులు జీ.నారయ్య, ఏ.శివ, ప్రధాన కార్యదర్శులు అంతపు ఈశ్వర్‌రెడ్డి, ఎం.శంకర్‌రెడ్డి, బాస్వంతరెడ్డి, కార్యదర్శులు తలారి రాముడు, గుజ్జల హనుమంతు, సీ.రహంతుల్లా, బీ.శ్రీనివాసులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు కే.విశ్వనాథ్, టీ.పోతలయ్య, ఎన్.సుదర్శన్, ఎన్.సన్నప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'ముమ్మాటికీ కక్ష సాధింపు చర్యే'

**కదిరి అర్బన్:** రాజంపేట ఎంపీ, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డీనేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అరెస్ట్ ముమ్మాటికీ కక్షసాధింపు చర్యేనని ఆ పార్టీ కదిరి నియోజకవర్గ మాజీ సమన్వయకర్త ఎస్ఎండీ ఇస్మాయిల్ పేర్కొన్నారు. ఈమేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపీ సిట్ విచారణకు అందుబాటులోనే ఉండి సహకరిస్తున్నా అరెస్ట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ హామీలు ఎక్కడ ప్రజలు నిలదీస్తారో అని డైవర్షన్‌పాలిటిక్స్‌లో భాగంగా ఈ అక్రమ అరెస్టులు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి వాటికి ప్రజలే సరైన సమయంలో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

**ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ దారుణం**

**అమడగూరు:** ఎలాంటి ఆధారాలు లేకుండా ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం దారుణమని, ఇది రాజకీయ కక్ష సాధింపేనని వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శేషురెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దె రాజునాయుడు, అమడగూరు మండల కన్వీనర్ తనకంటి జయప్ప ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇబ్బంది పెట్టటమే కూటమి ప్రభుత్వ ఎజెండాగా మారిందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రాజకీయ దురుద్దేశంతో అక్రమ అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం ఇలాంటి అక్రమ అరెస్టులను ఆపి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే భవిష్యత్తులో ప్రజలే ఎదురు తిరిగి పుట్టగతుల్లేకుండా చేస్తారని హెచ్చరించారు.

**ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికం**

**రామగిరి:** వైఎస్సార్‌సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికమని పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లాయర్ పేరూరు కురుబ నాగిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి దాడులు, అరెస్టులు పెరిగిపోయాయన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని మరచిపోయి రెడ్‌బుక్ పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్ష సాధింపులకు పాల్పడుతూ ఎటువంటి ఆధారాలు లేకుండా అక్రమంగా కేసులు పెడుతున్నారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో ఉన్న ఆదరణ చూసి ఓర్వలేకపోతున్నారన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

## రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

**నల్లమాడ:** రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని వైఎస్సార్ సీపీ నాయకులు విమర్శించారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొరకల రమణ, పార్టీ మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కే. సూర్యనారాయణ, నాయకులు కుళ్లాయినాయక్ ఆదివారం విలేకరులతో మాట్లాడారు. లిక్కర్ స్కాం పేరుతో వైఎస్సార్ సీపీ లోక్ సభ పక్షనేత, ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకపోగా వాటినుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే చంద్రబాబు కక్షపూరిత రాజకీయాలకు దిగుతున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వమే పారదర్శకంగా మద్యం విక్రయాలు చేపట్టిందని, అవినీతి జరిగే ఆస్కారమే లేకున్నా అబద్ధపు సాక్షాలతో చంద్రబాబు లేనది ఉన్నట్లు, ఉన్నది లేనట్లు కల్పితాలు చేసి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అయితే చంద్రబాబు ఏడాది పాలనతోనే విసిగిపోయారన్నారు. వచ్చేఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

**కొత్తచెరువు:** ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ ముమ్మాటికీ కక్ష సాధింపు చర్యేనని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్యామ్ సుందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పాదయాత్ర వాల్మీకి శంకర, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు వడ్డే నారాయణ పేర్కొన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల హామీలు అమలు చేయలేని కూటమి ప్రభుత్వం వాటిని పక్కదోవ పట్టించడానికి ఇలాంటి చర్యలకు పాల్పడుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన తీరును మార్చుకోవాలని లేనిపక్షంలో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మాజీ సర్పంచ్ లోచర్ల రాజా రెడ్డి, ఎంపీటీసీ గొడ్డలి రఫీ, మండల బీసీ సెల్ అధ్యక్షులు వడ్డే వైఎస్సార్ సీపీభాస్కర్, మండల యస్సీ సెల్ అధ్యక్షులు శోధన పల్లి రామాంజనేయులు, వినోద్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వాటర్‌ప్లాంట్ వితరణ


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

**రామగిరి:** పేరూరు డ్యాంలోని ఏపీఆర్ఎస్ బాలుర పాఠశాలకు హైదరాబాద్‌కు చెందిన సీసీఎల్ (కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్) వారు వాటర్ ప్లాంట్ వితరణ చేశారు. ఆదివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాటర్ ప్లాంట్‌ను సాహితీ గగన్ మహల్ అధ్యక్షుడు, న్యాయవాది ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1000 లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్‌ప్లాంట్‌ను సుమారు రూ.1.70 లక్షల ఖర్చుతో పాఠశాలలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో సేవా కార్యక్రమాలు విరివిగా చేపట్టడం జరుగుతోందన్నారు.

## అలరించిన చిన్నారుల ప్రదర్శన


శిల్పారామంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

**పుట్టపర్తి టౌన్:** స్థానిక శిల్పారామంలో చిన్నారులు తమ ఆటపాటలతో ప్రేక్షకులను అలరించారు. ఆదివారం ఆహ్లాదం కార్యక్రమాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జయంతిచారి డ్యాన్స్ అకాడమీ(బెంగళూరు) కళాకారులు అన్నమయ్య కీర్తనలకు చేసిన నృత్యం ఆకట్టుకుంది. శిల్పారామం ఏఓ ఖాదర్‌వలి, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## ధ్యానంతో మానసిక ప్రశాంతత


మాట్లాడుతున్న ధ్యాన గురువు లలిత

**బత్తలపల్లి:** ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ధర్మవరానికి చెందిన ధ్యాన గురువులు లలిత, మున్నీ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీహరి పిరమిడ్ ధ్యాన మందిరంలో ధ్యానం నాగేంద్ర ఆధ్వర్యంలో ఆనంద కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. ధ్యానం అంటే సుఖాసనంలో కూర్చొని కళ్లు మూసుకొని శ్వాస మీద ధ్యాస పెట్టడమేనన్నారు. ఉచ్ఛ్వాస నిశ్వాసలను గమనించాలని తద్వారా ఆలోచన రహిత స్థితి కలుగుతుందన్నారు. ధ్యానం చేయడానికి ఏ నియమ నిబంధనలు లేవన్నారు. ఎవరి వయస్సు ఎంత ఉంటుందో అన్ని నిమిషాలు ధ్యానం చేయవచ్చునన్నారు. ధ్యాన కేంద్రంకు వచ్చిన వారికి ముల్లగూరు అయ్యప్ప, ముల్లగూరు సరోజమ్మ దంపతులు భోజన వసతి ఏర్పాటు చేశారు. బత్తలపల్లి, యర్రాయపల్లి, అప్పరాచెరువు, గంటాపురం, పోట్లమర్రి, మన్నీల, వేల్పుమడుగు గ్రామాలకు చెందిన ధ్యాన మాస్టర్లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## అపూర్వ సమ్మేళనం


పుట్టపర్తిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు


ధర్మవరం: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


పోలేపల్లిలో అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

**పుట్టపర్తి టౌన్:** స్థానిక ఈశ్వరమ్మ ఉన్నత పాఠశాలలో 1993–94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. దాదాపు 31 ఏళ్ల తర్వాత అందరూ ఒకేచోట కలవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. అనంతరం తమకు చదువు నేర్పిన గురువులు మల్లిఖార్జున, గుప్తా, సత్యనారాయణ, మురళీమోహన్, క్రిష్టప్ప, సులోచన తదితరులను పూల మాలలు శాలువలతో సత్కరించారు. అనంతనం విందు భోజనాలు చేశారు.

**ధర్మవరం రూరల్:** పట్టణంలోని కొత్తపేటలో వున్న పిన్ను చంద్రాయప్ప శ్రేష్టి మున్సిపల్ హైస్కూల్ (రైల్వే స్కూల్) పాఠశాలలో 1989–90లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఎన్నో ఏళ్ల తరువాత కలుసుకున్న వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. నాటి అనుభూతులను గుర్తు చేసుకొని మురిసిపోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎంతో సంతోషంగా గడిపారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులను గుర్తు చేసుకున్నారు.

**రామగిరి:** మండలంలోని పోలేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 23 ఏళ్ల అనంతరం విద్యార్థులంతా పాఠశాలలో కలవడంతో సందడి వాతావరణం నెలకొంది. ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. చదువుకునే రోజుల్లో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

## వర్షం కోసం గంగమ్మకు పూజలు


గంగమ్మకు బోనాలను తీసుకెళుతున్న మహిళలు

**గాండ్లపెంట:** మండలంలోని వేపరాల గ్రామంలో ఆదివారం గ్రామస్తులు గంగమ్మకు వర్షం కోసం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉదయం ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలను తలపై ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి మంచి వర్షాలు కురిపించి పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


అశోక్‌రెడ్డి

**అనంతపురం:** నగరంలోని టీవీ టవర్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. తాడిమర్రి మండల కేంద్రానికి చెందిన అశోక్ రెడ్డి ద్విచక్ర వాహనంలో నగరం వైపు వస్తున్నాడు. రమణ అనే వ్యక్తి రోడ్డు దాటుతుండగా, అదుపు తప్పి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో అశోక్ రెడ్డి, రమణకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. తలకు బలమైన గాయం కావడంతో అశోక్ రెడ్డి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రమణ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. అశోక్ రెడ్డి ఎస్కేయూలో పీజీ పూర్తి చేశారు. వైఎస్సార్ విద్యార్థి విభాగంలో ఉంటూ పలు విద్యార్థి ఉద్యమాల్లోనూ పాల్గొన్నాడు. అశోక్ రెడ్డి మృతిపై పలువురు విచారం వ్యక్తం చేశారు.

## గుంతల దారి.. పడతారు జారి


చందమూరు సమీపంలో అధ్వానంగా రోడ్డు

**చెన్నేకొత్తపల్లి:** ఎన్ఎస్‌గేట్ నుంచి ధర్మవరం వెళ్లే ప్రధాన రహదారిపై చందమూరు బస్టాండ్‌కు సమీపంలో నూతనంగా నిర్మించిన కల్వర్టు వద్ద రోడ్డుపై గుంతలు పడ్డాయి. నిత్యం ఈ రహదారిపై వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గంలో అధికారులు, ప్రజాప్రతినిధులు తిరుగుతున్నా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అలాగే ప్యాదిండి బస్టాండ్‌లో రోడ్డు మధ్యన ప్రమాదకరంగా గుంత ఏర్పడింది. రాత్రి సమయంలో గుంతలు కనిపించక వేగంగా వాహనాలను నడిపితే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## జలధికి తరలిన పీర్ల స్వాములు


ఓబుళాపురంలో జలధికి వెళ్తున్న పీర్లు

**బత్తలపల్లి/ తాడిమర్రి/ పుట్టపర్తి టౌన్/ చెన్నేకొత్తపల్లి/ కనగానపల్లి:** బత్తలపల్లి మండలం తంబాపురం, ఓబుళాపురం, తాడిమర్రి మండలం నిడిగల్లు, పుట్టపర్తిలోని పెద్దబజార్, బ్రహ్మణపల్లి, చెన్నేకొత్తపల్లి మండలం పైలబోయలపల్లి, కనుముక్కల, న్యామద్దెల, గువ్వలగొందిపల్లి, కనగానపల్లి మండలం కుర్లపల్లి, చంద్రాచెర్ల, వేపకుంట గ్రామాల్లో పీర్ల జలధి కార్యక్రమం నిర్వహించారు. శనివారం రాత్రి చావిళ్ల ముందు ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో పెద్ద ఎత్తున మంటలు రగిలించారు. ఆదివారం తెల్లవారుజామున గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వాములను జలధికి తరలించారు.

## ఆలయ నిర్మాణానికి విరాళాలు

**నల్లచెరువు:** మండల కేంద్రంలో రామాలయ నిర్మాణానికి ఆదివారం పలువురు విరాళం అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యుడు, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి తెలిపారు. పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి ఆలయ మాజీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి రూ.25 వేలు, తలమర్లవాండ్లపల్లి సర్పంచ్ హర్షవర్ధన్‌నాయుడు రూ.20వేలు, పడుచూరి దామోదర్ గుప్త రూ.25 వేలు, పోస్టుమాన్ నరసింహులు రూ.25 వేలు, సీనియర్ జర్నలిస్ట్ నాగరాజు రూ.10 వేలు, శంకర్ నాయుడు రూ.10 వేలు, వైఎస్సార్ సీపీ నేత గట్టా హరి రూ. 10 వేలు, బిల్డర్ గంగులప్ప రూ.10 వేలు, టైలర్ రామాజనేయులు రూ. 5 వేలు అందించారన్నారు.